

కథా కౌముది

# మిస్టర్ పెర్ ఫెక్ట్ వడ్డాది వైదేహి

***హెల్మెట్ లేకుండా బండి తియ్యకూడదు. సీటు బెల్టు లేకుండా కారు కదపకూడదు. డ్రైవింగ్ లో ఉండగా, ఫోను తియ్యకూడదు.***

ఇవన్నీ చూడగానే, తెలుగు ప్రాంతపు ట్రాఫిక్ పోలీసుల భద్రతా సూక్తులనుకుంటున్నారా? మీరు సరిగ్గానే ఆలోచిస్తున్నారు, గానీ, ఇవన్నీ మా శ్రీవారు తు.చ. తప్పకుండా పాటించే అంశములు. బండిమీద వెళుతుండగా ఏదైనా వీధి కుళాయిలోంచీ నీరు

పోతూ ఉంటే, బండి ఆపి కొళాయి కట్టి మళ్ళీ బండి స్టార్ట్చెయ్యటం, అంతవరకూ అదే కొళాయికి గజం దూరంలో సరదాగా కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళు మా ఆయన్ని వింతగానూ, మమ్మలిని జాలిగానూ చూడటం కూడా అలవాటైంది. ఒకచోట పంచాయితీ వాళ్ళ నీళ్ళటేంకు నిండి నీరు పొర్లిపోతూ ఉంటే అక్కడున్న వాళ్ళని పంచాయితీ ఆఫీసు ఎక్కడ అని కనుక్కొని,అక్కడికెళ్ళి, వాచ్మేన్ ని పిలుచుకొచ్చి, పంపు కట్టించారు. వాచ్మేన్ వెళ్ళిపోయాకా ఈయన బండి స్టార్ట్ చేసేటప్పుడు అంతవరకూ ఆ టేంకు దగ్గరే కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళలో ఒకపెద్దమనిషి

“అయ్యో, సార్, అది పంచాయితీ వాళ్ళ డూటీ కదా. ఈపాటి దానికే ఈ ఆడకూతురిని (అంటే నేనే) రోడ్డు మీదనిలబెట్టి మీరు పంచాయితీ ఆఫీసుకెళ్ళాలా?” అని అడిగినందుకు, సదరు పెద్దమనిషికి పదినిమిషాల క్లాసు తీసుకున్నారు. నేరుగా ఆయన్నేమైనా అంటే ఆయన వినకపోవచ్చుగానీ, ఈయన పనిచేసిన రాయలసీమలో ప్రైవేటు నీళ్ళటేంకులవాళ్ళు బిందెడు నీళ్ళు రెండురూపాయలకు అమ్ముకొని మేడలు కట్టినవిషయాలు చెబుతూ ఉంటే వాళ్ళు ఈయన్ని ఖండించలేరు కదా. అందులో ఒక యువకుడు ధైర్యం చేసి, “అది రాయలసీమ, ఇది గోదావరి సార్. ఇక్కడ నీటికి కరువు రాదు“ అన్నాడు. చచ్చింది గొర్రె, కాదుకాదు చచ్చాయి గొర్రెలు అనుకున్నాన్నేను. గోదావరి జిల్లాల్లో రాగల నీటి కొరత అనే అంశం మీద మరోపదినిమిషాలు ఉపన్యసించి గాని వాళ్ళని వదిలిపెట్టలేదు.

ఇలాంటి ప్రహసనాల్లో, పక్కనే నిలుచొని ఉన్న నేను పెద్దగా ఇబ్బంది పడను గానీ నేను ఇబ్బంది పడుతున్నానేమోనని వాళ్ళు పడే జాలి నన్ను ఎక్కువ ఇబ్బంది పెడుతుంది.

ఈయన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం వదిలి, తెలుగు ప్రభుత్వపు ఉద్యోగంలో చేరిన ఏడాదినుంచీ ఇదే పరిస్థితి. ఈ ఏడాదిలో కొంచెం తగ్గింది గానీ ఇక్కడికొచ్చిన మొదట్లో ఈనకి చాలా కాలజ్ఞానం ఉండేది. కాలజ్ఞానం అంటే పోతులూరి వీరబ్రహ్మం గారినో, నోస్ట్రాడమస్నో గుర్తు తెచ్చుకోకండి. అచ్చ తెలుగు వాళ్ళుటైం సెన్స్ అంటారే, దాన్నే నేను కాలజ్ఞానం అన్నాననన్నమాట. ఈయన అర్థతరీత్యా పశువైద్యుడు. పశువుల ఆసుపత్రి ఉదయం ఎనిమిదికల్లా తీయాలి. మొదట్లో రోజూ ఠంచనుగా ఎనిమిదికల్లా వెళ్ళిపోయి, రైతులు తెచ్చిన పశువులకు వైద్యం చేసేస్తూ ఉంటే, ఈయన కింద పనిచేసే అసిస్టెంటు, నాలుగురోజుల తర్వాత తెగించి చెప్పాడు.

"సార్, నేను ఉద్యోగంలో చేరి పదిహేనేళ్ళయింది. ఉదయం తొమ్మిదినుంచీ, పన్నెండు వరకూ పనిచేసిన డాక్టరుని దేవుడు అనుకుంటారు. ఇక్కడ కూడా, రైతులు, తొమ్మిది దాటినా పని మొదలెట్టకపోతేనే అడుగుతారు. మీరు ఇలా చేస్తే, మీ తర్వాత వచ్చే డాక్టరుగారు ఎనిమిదికి రాకపోతే రైతులు ఆ డాక్టరు గారిని నిలదీస్తారు. ఆయన మీగురించి చెడ్డగా అనుకుంటారు."

అలా మా ఆయన కాలజ్ఞానం విషయంలో జనజీవన స్రవంతిలో కలిసారు.

నా ఇబ్బందులు గురించి చెప్పేముందు కొంచెం అప్రస్తుత ప్రసంగం చేయాల్సి వచ్చింది.

ఇప్పుడు ప్రస్తుత ప్రసంగం.

నాకు పానీ పూరీ అంటే ఇష్టం. పెళ్ళైన కొత్తలో, ఏవండీ పానీపూరీ అంటే, పక్కనున్న ఫ్రూట్ జ్యూస్ ఇప్పించేవారు. మర్యాదకోసం ఫ్రూట్ జ్యూస్ తాగి, అలాంటి నాలుగు ఫ్రూట్ జ్యూసులు తరువాత పానీపూరీ కోసం రెట్టించాను. ఆహార పదార్ధాలలో శుభ్రత అనే అంశంపై నాకు మొదటి క్లాసు...! కొత్త భర్త కదా (అంటేఇంకా భర్త పాతబడలేదని నా ఉద్దేశం). అందుకని ఎదురుచెప్పలేదు.

పోనీకదా అని పానీపూరీ విషయంలో సర్దుకుంటే, సింహం జూలు విదిల్చి, నా ఐదోక్లాసునుంచే నాకు ఆరోప్రాణామైన కాఫీ మీద పడింది, ఈయన కన్ను. అప్పటికి దంపతులుగా మాప్రొబేషన్ పూర్తయింది. అంటే మా తొలి సంతానికి మొదటి పుట్టినరోజు అయిందన్నమాట. కాఫీ మానేది లేదని గట్టిగానే చెప్పాను. గట్టిగానే ఊరుకున్నారనుకున్నాను.

ఒకరోజు జ్వరం వచ్చి డాక్టర్ దగ్గరికెళితే, "కాఫీ తాగటంవల్ల ఇబ్బంది ఉందా?" అని అడిగారు. "అబ్బబ్బే అదేం లేదండీ" అన్నారు డాక్టరుగారు. నేను ఆయనవైపు చూసిన చూపులో అచ్చికచ్చిక, బాగా అయిందా అన్న వేళాకోళం సరిగ్గానే అర్ధం చేసుకున్నారు.

డాక్టరుగారి దగ్గర నుండి మందులు తీసుకొని వచ్చేస్తూ, "ఐతే మందులు వాడుతున్నన్నాళ్ళూ ఎన్నిసార్లు కాఫీ తాగినా పర్వాలేదు కదా!" అని అడిగారు. వాస్తవాలిని వక్రీకరించడంలో ఈయన దగ్గర మీడియా వాళ్ళు పాఠాలు నేర్చుకోవాలి.

వెంటనే డాక్టరుగారు, "మందులు వాడుతున్నన్నాళ్ళూ కాఫీ టీ లు తగ్గిస్తే మంచి ఫలితం ఉంటుంది" అన్నారాయన. బహుశః నేను రోజుకి ఐదారుసార్లు కాఫీ తాగుతున్నానని అర్ధం చేసుకున్నట్టున్నారు.

అప్పటివరకూ ఫెమినిస్టుల రచనలు, వాళ్ళు వర్ణించే పురుషాహంకారం, బలవంతంగా భార్యల ఇష్టాఇష్టాలు ప్రభావితం చేయటం ట్రేష్ అనిపించేవి. లాభం లేదు తిరుగుబాటు చెయ్యవలసిందే అనుకున్నాను.

ముందుగా పానీ పూరీ. బయటికెళ్ళిన ప్రతీసారీ తినేసేదాన్ని. పానీపూరీ విషయంలో నా విజయంతో, కాఫీ దగ్గర కొంచెం తగ్గాను. పానీపూరీకి ఏడాది గడిచేసరికి, నాప్లేటులోంచీ తీసుకొని తినడం మొదలెట్టారు. రెండో ఏడు గడిచేసరికి నాకిష్టం లేకపోతే ఒక్కరే పానీపూరీ తినేయటం మొదలెట్టారు.

తరువాత తన పుట్టినరోజు గిఫ్టుగా కాఫీ అడిగేరు. అంటే, తను అప్పుడప్పుడు తాగుతాననీ, నన్ను అస్సలు తాగొద్దనీ. గిఫ్టు కదా. మరీ మంగమ్మ శపథంలా, నేనే కాఫీ తాగితే.........., అని కాకపోయినా, దాదాపు కాఫీ మానేసాననే చెప్పాలి.

మా ఎనిమిదేళ్ళ కాపురానికి, వారానికీ ఐదురోజులు అఫీషియల్ బ్రేక్. అంటే, ఆయన ఆఫీసువాళ్ళు బదిలీ చేయటం మూలంగా, ఆయన వేరే ఊళ్ళో ఒక్కరూ ఉండాల్సి వచ్చింది. ఈయనతో పాటు మరో ఇద్దరు బలవంతపు బ్రహ్మచారులు (అనగా ఫోర్సుడ్ బేచిలర్స్) కలిసి ఒక ఇంటివారయ్యారు (అంటే ఒకే ఇల్లుఅద్దెకు తీసుకున్నారని నా భావం).

ఆ ముగ్గురిలో ఈయనే నలభీముల వారసుడిగా గుర్తింప బడ్డారు. మా ఇంట్లో వంటిల్లు తెలీని మనిషి అక్కడ వంట చేస్తూ, "ఈరోజు కిచిడీ చేసాను, ఈరోజు పప్పు చేసాను" అని చెబుతూ ఉంటే, "ఒకసారి నాక్కూడ మీరు వంట చేసి తినిపించండి" అన్నాను.

"నాది డైనమిక్ ఎండ్ స్పాంటేనియస్ రెసిపీ" అన్నారు. నా ప్రశ్నార్ధకపు మొహం చూసి, అంటే, "నేను వంట చేసే పద్ధతి రోజూ మారుతూ ఉంటుంది. ఉదాహరణకి, ఒకరోజు ఉల్లిపాయలు వేగేకా ఉప్పువేసి తర్వాత పప్పు వేస్తాను. తర్వాత రోజు ఉల్లిపాయలూ, పప్పూ వేసి, దింపేముందు ఉప్పు, ఇంకోరోజు ఉప్పుకలపలేదన్న విషయం డైనింగ్ టేబిల్ మీద తెలిస్తే, పప్పుని అన్నంలో వేసుకొని ఉప్పు కలుపుకుంటాం. ఇదే సూత్రం

ప్రతీ వంటకీ, ప్రతీ దినుసుకీ వర్తిస్తుంది” అన్నారు. అది విన్నాకా కూడా నేను తెగించి ఆయనచేతే వంట చేయిస్తానని భయపడ్డట్టుంది, మా ఆరేళ్ళ చిన్నది. నేను మాట్లాడేలోపలే, “నువ్వే చెయ్యమ్మా వంట” అంది.

వాళ్ళనాన్న వారానికోసారి ఇంటికొచ్చినప్పుడు ఉతికి ఇస్త్రీచేయించి పేంటూ షర్టులిని జతలుగా పెట్టి ఇచ్చినా, వారం తర్వాత వచ్చేటప్పుడు "నాన్నా వేరే పేంటుమీద వేసుకోవలిసిన షర్టు దీనిమీద వేసుకున్నావు," అని చెప్పటం, వెంటనే ఈయన, కేయూరాని నభూషంతి పురుషం అంటూ వేషం కన్నా భాష, జ్ఞానంముఖ్యం అంటూ దానికీ నాకూ కూడ కలిపి క్లాసు తీసుకోవటం మామూలే.

నాకు తగిలిన తాజా గాయం చెప్పకుండా ముగిస్తే నాక్కడుపునొప్పి రావచ్చు. ఈరోజు తన పుట్టినరోజు. ఉదయాన్నే ఫోన్ చేసా, హలో అనకుండానే, “కాఫీ తాగుతున్నాను. పూర్తిగా తాగాకా మళ్ళా చేస్తాను” అని పెట్టేసారు. ఏడుపొచ్చింది. ఎందుకంటే, ఈరోజుకి నేను నా కాఫీ మానేసి సరిగ్గా ఏడాది.

★★★

**Click here to share your comments on this story**